అక్రమ బ్లాస్టింగ్‌ను ఆపండి

• వెంకటాయపల్లి గ్రామస్తుల ఫిర్యాదు



దేవరకద్ర: ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న వెంకటాయపల్లి గ్రామస్తులు

దేవరకద్ర: మండలంలోని వెంకటాయపల్లి గ్రామంలో అక్రమంగా బ్లాస్టింగ్‌లు ఆపాలని సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజావాణిలో గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. గ్రామానికి సమీపంలో ఉన్న గుట్టల్లో బ్లాస్టింగ్‌లు చేసి రాళ్లను తరలిస్తున్నారని, దీనికి ఎలాంటి అనుమతులు లేదని వారు ఆరోపించారు. ప్రతిరోజు బ్లాస్టింగ్‌లు చేయడంతో గ్రామంలోని ఇళ్లు నెర్రలు వారుతున్నాయని, కొన్ని రాళ్లు గ్రామానికి సమీపంలో పడుతున్నాయని అన్నారు. బ్లాస్టింగ్ చేసేవారు దౌర్జన్యంగా వ్యవహరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శించారు. ఈ విషయమై తగు చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీపీ భారతమ్మ అధికారులను కోరారు. గ్రామంలో తాగునీటి, విద్యుత్ సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కరించాలని కోరారు. ప్రజావాణికి మరిన్ని ఫిర్యాదులు వచ్చాయి. తహసీల్దార్ కృష్ణయ్య, ఏఓ రాజేందర్‌అగర్వాల్, ఎంఈఓ బలరాం, ఏపీఎం రామన్న, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వినతులు నిల్

నవాబుపేట: ప్రజల సమస్యలపై ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి ఒక్క ఫిర్యాదు కూడా రాలేదని ఎంపీడీఓ జయరాంనాయక్ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులందరూ వేచిఉండగా మధ్యాహ్నం వరకు ఎలాంటి దరఖాస్తులు రాలేదన్నారు. తహసీల్దార్ శ్రీనివాస్, బద్రునాయక్ తదితరులున్నారు.

శివసాయిరాం కాలనీలో డ్రెయినేజీలు నిర్మించాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: తమ కాలనీలో డ్రెయినేజీలు లేక ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే నిర్మించాలని శివసాయిరాం కాలనీవాసులు వాపోయారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజావాణి'లో స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా మర్లు నుంచి బైపాస్ మీదుగా తమ కాలనీ గుండా ఓపెన్ నాలాలో మురుగు మొత్తం కలుస్తోందన్నారు. ఈ క్రమంలో సమీపంలోని ఓ ప్రైవేట్ పాఠశాల నుంచి వచ్చే మురుగు సైతం ఓపెన్ ప్లాట్లలో కలిసి నిండిపోతోందన్నారు. చివరకు తమ ఇళ్లలోని ఇన్‌వెల్ బోర్ల నుంచి మురుగుతో కూడిన నీరు వస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటుచేసి శాశ్వతంగా సమస్యను పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ కమిటీ అధ్యక్షుడు జి.సత్యనారాయణ రెడ్డి, కోశాధికారి శంకరయ్య, సభ్యులు కె.సత్యనారాయణచారి, నర్సింహారెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఈ కాలనీకి మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌రెడ్డి వెళ్లి కాలనీ వాసులతో పాటు ప్రైవేట్ పాఠశాల యాజమాన్యంతో మాట్లాడారు. పాఠశాల నుంచి పెద్ద కాల్వ వరకు మురుగు సాఫీగా వెళ్లేందుకు 60 మీటర్ల మేర సిమెంట్ పైపులు వేస్తామని యాజమాన్యం అంగీకరించింది.



శివసాయిరాం కాలనీలో ఇళ్ల మధ్య నిలిచిన మురుగు

అవకాశం కల్పించాలి

హన్వాడ: త్వరలో జరగబోయే లోకల్‌బాడీ ఎన్నికల్లో రోస్టర్ విధాన్ని అవలంభిస్తూ రొటేషన్ పద్ధతిలో అన్నివర్గాలకు ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని బుద్దారామ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రజావాణిలో ఎంపీడీఓ యశోదకు వినతి పత్రం అందించారు. ప్రభుత్వం 2019లో తెచ్చిన విధానాన్ని తొలగించి అంతకుముందుగా ఉన్న మాదిరి రోస్టర్ విధానంలో రోటేషన్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఆసంఘం మండల అధ్యక్షుడు బాలకిష్టయ్య, వెంకటేష్, జంబులయ్య, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎన్‌ఏఎస్ పరీక్ష విజయవంతం చేద్దాం



జడ్చర్ల టౌన్: బుధవారం నిర్వహించబోయే ఎన్‌ఏఎస్-24 పరీక్షను విజయవంతం చేసేందుకు అందరం కృషిచేద్దామని ఎంఈఓ మంజులాదేవి ప్రధానోపాధ్యాయులకు సూచించారు. సోమవారం ఎమ్మార్సీ కార్యాలయంలో పరీక్షకు సంబంధించి పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. మండలంలో మొత్తం ఎంపిక చేసిన 26పాఠశాలల్లో 3, 6, 9 తరగతుల విద్యార్థులు పరీక్షకు హాజరయ్యేలా చూడాలన్నారు. పరీక్ష కోసం బుధవారం ఉదయం ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లు పాఠశాలకు చేరుకుంటారని, వారు తగిన ఏర్పాట్లు చేసుకుంటారన్నారు. వారికి సహకరించాలని, పరీక్ష నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

వేలం ద్వారా రూ.8లక్షల ఆదాయం

దేవరకద్ర: ప్రసిద్ధ చిన్నరాజమూర్ ఆంజనేయ స్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలు ఈ నెల మూడో వారంలో జరగనుంది. సోమవారం దేవాలయం వద్ద వివిధ వేలాలు నిర్వహించగా ఆలయానికి రూ.8.26లక్షలు ఆదాయం వచ్చినట్లు ఆలయాధికారులు తెలిపారు. తలనీలాలు వేలం రూ.4.71లక్షలకు శ్రీనివాసులు అనే వ్యక్తి ఏడాది వరకు వేలం దక్కించుకున్నాడు. టెంకాయల వేలం జాతర నెల వరకు రూ.2.70 లక్షలకు కుర్మయ్య అనే వ్యక్తికి కాంట్రాక్ట్ లభించింది. ఏడాది పాటు కొబ్బరి చిప్పలు ప్రోగు చేసుకోడానికి వెంకటేశ్ అనే వ్యక్తి రూ.85,500కు పొందాడు. వేలంలో దేవస్థాన కమిటీ చైర్మన్ రాఘవేంద్రాచారి, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వీణాధారి, ఈఓ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక నియంత్రణ కమిటీ ఏర్పాటు

మిడ్జిల్: దుందుభీ వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలించకుండా నియంత్రించేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు మండల స్థాయిలో కమిటీని సోమవారం ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ రాజు తెలిపారు. ఈ కమిటీలో తహసీల్దార్, ఎస్ఐ, ఎంపీఓ, ఏఈ, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సభ్యులుగా ఉంటారన్నారు. ఈమేరకు తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు, ఎంపీఓ జగదీశ్వర్ , ఏఈ హర్షిత్ పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణ బాధ్యత మనందరిది



హన్వాడ: ఎయిడ్స్‌ని నివారించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఓఎమ్‌ఐఎఫ్ సంస్థ కోఆర్డినేటర్ రాములు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఎయిడ్స్ నియంత్రణపై ఆ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు జంబులయ్య, అంజిలమ్మ, వెంకటయ్య, బాల్‌రాజు, ఐసీఐసీఐ ఫౌండేషన్ పీఏఫ్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు అభినందనలు

జడ్చర్ల: తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిజామబాద్ జిల్లా ఆర్మూర్‌లో గత నెల 29 నుంచి ఈ నెల 1వతేదీ వరకు జరిగిన జూనియర్ బాలికల అంతర్ జిల్లాల హ్యాండ్‌బాల్ పోటీలలో ఉమ్మడి పాలమూరు జట్టు రన్నరప్‌గా నిలిచింది. విజేతలను సోమవారం బాలుర ఉన్నత పాఠశాలలో అభినందించారు. హ్యాండ్‌బాల్ అసోసి యేషన్ జిల్లా అధ్యక్షుడు గోవింద్‌నాయక్, జీహెచ్‌ఎం చంద్రకళ, పీఈటీలు శంకర్‌నాయక్, నిరంజన్ పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: ప్రజాపాలన వారోత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో కోడ్గల్ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన హేమంత్ ప్రథమ బహుమతి సాధించాడు. డీఈఓ ప్రవీణ్‌కుమార్ హేమంత్‌కు ప్రశంసా పత్రం అందించారు. ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థిని హెచ్‌ఎం శ్రీనివాసులు, అమ్మ ఆదర్శపాఠశాల కమిటీ చైర్మన్ లక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.

మ్యాథ్స్ టీచర్లకు శిక్షణ

జడ్చర్ల టౌన్: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో మంగళ, బుధవారాల్లో జడ్చర్ల, రాజాపూర్ మండలాల్లోని పది జెడ్పీ హైస్కూళ్ల గణిత ఉపాధ్యాయులకు శిక్షణ ఉంటుందని ఎంఈఓ మంజులాదేవి తెలిపారు. జిల్లాలోని థర్మోగ్రూప్స్ ఆఫ్‌కంపెనీస్, శ్రీరామ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శిక్షణ ఉంటుందని అన్నారు. పై సంస్థల సహకారంతో పది జెడ్పీహైస్కూళ్లలో మ్యాథమెటిక్స్ ల్యాబ్స్‌ను స్థాపిస్తున్నారన్నారు.

అఖండ భజనలు



హన్వాడ: స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో స్థానిక భజనమండలి భక్తులు ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజామున దాకా అఖండ భజనలు చేశారు. ఆంజనేయస్వామి చిత్రపటాన్ని ప్రత్యేక వాహనంలో ప్రధానరహదారి వెంట ఊరేగించారు. ఆలయ కమిటీ చైర్మన్ కొండ బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో అన్న ప్రసాదాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ కార్యదర్శి కృష్ణయ్య, బాలయ్య, భక్తులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో అన్నదానం

గండేడ్: కార్తీక మాసం ముగింపు సందర్భంగా ఆయా గ్రామాల్లో ఆలయాల్లో ఆదివారం రాత్రి అఖండ భజనలు నిర్వహించారు. సోమవారం ఉదయం వరకు భజనలు చేసి అనంతరం అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. గండేడ్ మండలంలోని వెన్నాచేడ్, గండేడ్, లింగాయిపల్లి, కొంరెడ్డిపల్లి, సల్కర్‌పేట్, పగిడ్యాల్ గ్రామాల్లోని ఆలయాల్లో ఈ కార్యక్రమాలు కొనసాగాయి. వెన్నాచేడ్‌లో బంతిపూలతో ఆంజనేయస్వామి ప్రతిమ తయారు చేసి భక్తి శ్రద్ధలతో ఊరేగించారు.

రాజాపూర్: మండలంలోని రాయపల్లిలోని ఆంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు అఖండ భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆంజనేయుడి ఉత్సవ విగ్రహాన్ని గ్రామ పురవీధుల గుండా పల్లకీలో ఊరేగించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. గ్రామస్తులు వెంకట్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్, రాములుచారి, రామ్‌రెడ్డి, నర్సింలుగౌడ్, పుల్లయ్య,ఎర్రన్న, మహేష్‌గౌడ్, ప్రశాంత్‌చారి, రామకృష్ణ పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 15వ వార్డు పరిధిలోని చిన్నదర్పల్లిలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను సోమవారం రాత్రి మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లక్ష్మణ్‌నాయక్, కుమార్‌గౌడ్, కమల్‌కాంత్, కురుమూర్తి, మెండే నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గీత శ్లోక పోటీల్లో 'న్యూరిషి' విద్యార్థుల ప్రతిభ



స్టేషన్ మహబూబ్‌నగర్: స్థానిక రాజేంద్రనగర్‌లోని న్యూరిషి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీల్లో ప్రతిభచాటినట్లు ప్రిన్సిపాల్ వెంకటరమణ తెలిపారు. 8వ తరగతికి చెందిన వరలక్ష్మి ప్రథమ, 9వ తరగతికి చెందిన శాలిత ద్వితీయస్థానాల్లో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. జిల్లా కేంద్రంలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 రగ్బీ పోటీల్లో పాఠశాల 8వతరగతి విద్యార్థి యువరాజ్ పాల్గొన్నట్లు తెలిపారు. విద్యార్థులను పాఠశాల డైరెక్టర్లు, ప్రిన్సిపాల్ తదితరులు అభినందించారు.

హామీలను అమలుచేయడమే లక్ష్యం



ట్రాక్టర్‌లో ర్యాలీగా వస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, తదితరులు

• ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి
• అట్టహాసంగా బాలానగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకారం

రాజాపూర్(బాలానగర్): నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడమే లక్ష్యమని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. సోమవారం ఉమ్మడి బాలానగర్, రాజాపూర్ మండలాల వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బాలానగర్ నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అశ్విని, వైస్ చైర్మన్ శేఖర్‌గౌడ్‌తో పాటు డైరెక్టర్లతో జిల్లా మార్కెటింగ్ అధికారి బాలమణి ప్రమాణస్వీకారం చేయించారు. ఈసందర్భంగా నూతన పాలకవర్గానికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్లలో నియోజకవర్గ అభివృద్ధికి రూ.175 కోట్ల నిధులు మంజూరు చేయిస్తే అందులో రూ.90కోట్లు నిధులు వెనక్కి వెళ్లాయని అన్నారు. ఒక్క ఏడాదిలోనే రూ.153కోట్ల నిధులు తెచ్చి పనులు కూడా ప్రారంభించినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితెందర్, జడ్చర్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ జ్యోతి ఆల్వాల్‌రెడ్డి, నాయకులు శంకర్, కృష్ణయ్య, నరహరి, యాదయ్య, మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, సత్యనారాయణ, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి

రాజాపూర్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు, బాలుర ఉన్నతపాఠశాల విద్యార్థులకు షూ పంపిణీ చేశారు. వచ్చే సంవత్సరం షూతోపాటు వాటర్‌బాటిల్, బ్యాగ్‌ను అందించడంతో పాటు పదో తరగతి విద్యార్థులకు ఆల్‌ఇన్‌వన్ బుక్స్‌లో ఉండే విషయాలను డిజిటల్ రూపంలో అందిస్తామన్నారు. పాఠశాలలో క్రీడా గ్రౌండ్ ఇబ్బందిగా, మౌళిక వసతులు కల్పించాలని ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్ ఎమ్మెల్యేను కోరారు.

డంపింగ్ యార్డ్‌తో ప్రమాదం

మరికల్: మండల కేంద్రానికి సంబంధించిన డంపింగ్ యార్డుతో ఇబ్రహీంపట్నం గ్రామస్తులకు ప్రమాదం పొంచిఉంది. మరికల్‌కు సంబంధించిన డంపింగ్ యార్డు పక్కనే ఇబ్రహీంపట్నం ఉండటం వల్ల ఆ గ్రామస్తులు దీని ద్వారా వచ్చే దుర్వాసనతో అనారోగ్యం బారిన పడుతున్నారు. డంపింగ్‌యార్డు కిందనే పెద్దచెరువు ఉండటం వల్ల చెరువులోకి వ్యర్థ పదార్థాలు చేరి నీళ్లు కలుషిత మవుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డంపింగ్ యార్డును మార్చాలని ఎన్నోమార్లు అధికారులకు చెప్పినా ఫలితం లేదన్నారు. వెంటనే అధికారులు స్పందించి డంపింగ్ యార్డును మార్చేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మాలధారులు ఆదర్శంగా నిలవాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: అయ్యప్పస్వామి మాలధారులందరూ సమాజంలో ఆదర్శంగా నిలవాలని మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్ కుమార్‌గౌడ్ సూచించారు. సోమవారం స్థానిక శ్రీనివాసకాలనీలోని అయ్యప్ప ఆలయంలో మహాపడిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలధారులు అయ్యప్ప దీక్షా నియమాలను నిత్య జీవితంలో పాటించాలన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో గురుస్వామి రఘుపతిశర్మ, మాలధారులు సీమ నరేందర్, కుమార్‌గౌడ్, కమల్‌కాంత్, సతీష్, రమేష్, సురేష్ పాల్గొన్నారు.



మహా పడిపూజలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, మాలధారులు

అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న మాలధారులు

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని సంకల్పసిద్ధి హరిహర అయ్యప్ప క్షేత్రంలో సోమవారం అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన ఆలయంలోని అయ్యప్ప స్వామి విగ్రహానికి పంచామృతాభిషేకం, మధ్యాహ్నం నైవేద్యం సమర్పించారు. ప్రత్యేక పూజలు చేసి మంగళహారతి ఇచ్చి తీర్థప్రసాదాలను అందజేశారు. పూజలకు పంచవటి విద్యాలయం కరస్పాండెంట్ అనితారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గురుస్వాములు తిరుపతయ్యగౌడ్, కొంగరి శ్రీనివాసులు, విశ్వేశ్‌నాథ్, రాములు, సాయిరెడ్డి, ప్రభాకర్, నర్సింహ్మారెడ్డి, నరహరి, ప్రవీణ్, రాజుగౌడ్ తదితరులున్నారు.

విద్యార్థులపై తగిన శ్రద్ధవహించాలి

• అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

అడ్డాకుల: విద్యార్థులపై వసతిగృహ అధికారులు తగిన శ్రద్ధవహించాలని అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ ఆదేశించారు. మూసాపేట మండల కేంద్రంలోని ఎస్సీ, బీసీ బాలుర వసతిగృహాలను సోమవారం సాయంత్రం ఆయన తనిఖీ చేశారు. హాస్టళ్లల్లో విద్యార్థుల కోసం సిద్ధంచేసిన వంటలను పరిశీలించారు. విద్యార్థులు ఉండే గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. నాణ్యమైన ఆహారం అందిస్తున్నారా.. లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంకలమద్ది శివారులో ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. అక్కడ విద్యార్థినుల కోసం వండిన భోజనాన్ని పరిశీలించారు. విద్యాలయంలో సౌకర్యాలపై ఆరా తీశారు. నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజు, ఎంపీడీఓ కృష్ణయ్య, ఎంపీఓ అనురాధ తదితరులున్నారు.



కేజీబీవీలో అధికారులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

మున్సిపాలిటీలో 100శాతం డాటా ఎంట్రీ

• వెనుకబడిన మిడ్జిల్ మండలం

జడ్చర్ల టౌన్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వేకు సంబంధించిన డాటా ఎంట్రీ జడ్చర్ల మున్సిపాలిటీలో 100శాతం పూర్తయ్యింది. మండలంలో 97శాతం, జిల్లా మొత్తంగా 91శాతం డాటా ఎంట్రీ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలో జడ్చర్ల, భూత్పూర్, మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలు ఉన్నాయి. జడ్చర్లలో 13,427 కుటుంబాలను సర్వే నిర్వహించగా ఆదివారం 13,559 కుటుంబాల వివరాలు డేటాఎంట్రీ పూర్తిచేసి 100.98శాతంగా నమోదు చేశారు. సర్వే సమయంలో ఇళ్లకు తాళాలు ఉండటంతో అందుబాటులో లేని వాళ్ల వివరాలు నమోదు చేశారు. దీంతో లక్ష్యానికి మించి డేటా ఎంట్రీ చేశారు. భూత్పూర్ మున్సిపాలిటీలో 3,987 కుటుంబాలు సర్వే చేశారు. 3,510కుటుంబాల వివరాలు ఆన్‌లైన్‌లో చేయగా 85శాతంగా నమోదైంది. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో 73,268 కుటుంబాలను సర్వే చేశారు. 59వేల కుటుంబాల ఆన్‌లైన్ ఎంట్రీ పూర్తయి 80శాతంగా నమోదైంది.

మండలాల్లో...

జడ్చర్ల మండలంలో 15,334కుటుంబాలు సర్వే చేయగా సోమవారం సాయంత్రం 14,939 కుటుంబాల వివరాలు డాటా ఎంట్రీ నమోదు జరిగి 97శాతం అయ్యింది. భూత్పూర్, దేవరకద్ర, కొకుంట్ల, మహబూబ్‌నగర్ రూరల్ మండలాల్లో 100శాతం డేటా ఎంట్రీ పూర్తయ్యింది. మిడ్జిల్ మండలం మాత్రం డేటా ఎంట్రీలో వెనకబడింది. జిల్లాలో 2,74,531 కుటుంబాలను సర్వే నిర్వహించారు. 2,26,305 కుటుంబాల వివరాలు డేటా ఎంట్రీ పూర్తి చేశారు. మరో 12,576 కుటుంబాల వివరాలు ఎంట్రీ చేయాల్సి ఉంది. సోమవారం సాయంత్రం లోపు డేటా ఎంట్రీ పూర్తికావాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.



డాటా ఎంట్రీ చేస్తున్న ఆపరేటర్లు

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

• మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత

జడ్చర్ల: స్వయం ఉపాధి రంగాల్లో మహిళలు రాణించి ఆర్థికాభివృద్ధి చెందాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత అన్నారు. సోమవారం స్థానిక ఉమెన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కుట్టుశిక్షణ కేంద్రాన్ని ఆమె సందర్శించి మాట్లాడారు. మహిళలు బ్యూటీషియన్, జరదోషి, మగ్గం వర్క్ తదితర స్వయం ఉపాధి పథకాల్లో శిక్షణ పొంది రాణించాలని కోరారు. అనంతరం చైర్‌పర్సన్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షురాలు బాలమణి, కౌన్సిలర్ సతీష్, పరమటయ్య, రాధాక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన పురపాలిక అటెండర్ కృష్ణయ్య కుటుంబాన్ని చైర్‌పర్సన్ పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.20వేల ఆర్థికసాయాన్ని అందజేశారు.



మహిళలను అభినందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత

క్రీస్తు మార్గంలో నడవాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: యేసు క్రీస్తు చూపిన మార్గంలో నడవాలని హైదరాబాద్‌కు చెందిన బిషప్ విల్సన్ సింగం అన్నారు. జిల్లా కేంద్రం క్రిస్టియన్‌పల్లిలోని క్రీస్తుజ్యోతి విద్యాలయంలో సోమవారం రాత్రి మహబూబ్‌నగర్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బిషప్ విల్సన్ సింగం క్రీస్తు సందేశమిచ్చారు. యేసుక్రీస్తు బోధనలు మానవాళికి ఆచరణీయమని అన్నారు. స్థానిక కల్వరి ఎంబీ చర్చి చైర్మన్, సీనియర్ పాస్టర్ రెవరెండ్ ఎస్.వరప్రసాద్, ఇతర పాస్టర్లు దేశ క్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్స్ ఫెలోషిప్ వైస్ చైర్మన్ రెవరెండ్ కేపీ.ఎబ్రాహం, కార్యదర్శి ఎంఆర్.సుందర్‌పాల్, కోశాధికారి బీఎస్.పరంజ్యోతి, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

జడ్చర్ల: స్థానిక ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు మంగళవారం వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ విప్లవరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనేవారు రూ.5వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

నవాబుపేట: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని సీజ్ చేసినట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు. సోమవారం తెల్లవారుజామున రుద్రారం సమీపంలో కారూర్ వాగు నుంచి అనుమతుల్లేకుండా ఇసుకను తరలిస్తున్నారు. అక్కడికి చేరుకొని ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకొని, ట్రాక్టర్ యజమాని ప్రవీణ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థిపై విచక్షణ రహితంగా దాడి

మహబూబ్‌నగర్ క్రైం: తరగతి గదిలో కూర్చుని ఉన్న ఓ విద్యార్థిపై అదే క్లాస్‌కు చెందిన మరో విద్యార్థి విచక్షణ రహితంగా దాడి చేశాడు. ఈ సంఘటన స్థానికంగా క కలకలం రేపింది. వివరాలు.. తిరుమల హిల్స్ సమీపంలో ఓ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న ఓ విద్యార్థి నవంబర్ 30న ఉదయం 8గంటల ప్రాంతంలో తరగతి గదిలో కూర్చుని ఉన్న క్రమంలో అదే క్లాస్‌కు చెందిన మరో విద్యార్థి దాడి చేశాడు. దీంతో ఆ విద్యార్థికి రక్తగాయం అయ్యింది. ఈనెల 29న విద్యార్థులు తరగతి గది నుంచి మెట్ల ద్వారా కిందకు దిగుతున్నారు. ఈక్రమంలో ఎవరో దాడి చేసిన యువకుడిని తోయడంతో అలా చేసింది ఈవిద్యార్థే అనుకోని అతడిపై దాడి చేసినట్లు తెలుస్తోంది. గాయపడిన విద్యార్థి సోమవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

మండలాల్లో 4న బైక్‌ర్యాలీలు

• బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి



జడ్చర్ల టౌన్: కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలన నిరసిస్తూ ఈనెల 4వ తేదీన అన్ని మండలాల్లో బైక్ ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ కళాభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. బైక్‌ర్యాలీల అనంతరం అన్ని మండలాల నుంచి నియోజకవర్గ కేంద్రం జడ్చర్లకు చేరుకుని ఇక్కడ సభ నిర్వహిస్తామన్నారు. సభకు రాష్ట్రనాయకులు పాల్గొంటారన్నారు. కాంగ్రెస్ పార్టీలను ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. ఈ బైక్‌ర్యాలీలు, సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పాలనపై పార్టీ రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు జనార్దన్ రెడ్డి, బాలకృష్ణ, బాలత్రిపురసుందరి, బాలవర్ధన్‌గౌడ్, తిరుపతి, నాగరాజు, శ్రీకాంత్, శ్రీనాథ్‌లు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్



దేవరకద్ర: ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొండా ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం సాయంత్రం దేవరకద్రలో నియోజకవర్గ కేంద్రంలో జరిగిన బీజేపీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారంటీలను అరకొరగా అమలుచేసి ప్రజల వ్యతిరేకతను కప్పిపుచ్చుకోడానికి ఏడాది పండుగ చేసుకోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూ బైక్ ర్యాలీలు నిర్వహించాక కొత్తకోటలో బహిరంగ సభ ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ భరత్‌భూషణ్, వనపర్తి అసెంబ్లీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, సభ్యత్వ అసెంబ్లీ ఇన్‌చార్జి నారాయణరెడ్డి, దేవరకద్ర మండల బీజేపీ అధ్యక్షుడు కృష్ణంరాజు, నాయకులు రామకృష్ణారెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, కొండారెడ్డి, నరేందర్, నరసింహా, గోవర్దన్‌రెడ్డి, రాజేందర్ పాల్గొన్నారు.